సాక్షి అనకాపల్లి
మంగళవారం । 20 । మే । 2025



# అవయవ దానం

- దుఃఖంలోనూ పరిమళించిన మానవత్వం


సత్యవతీదేవి

అనకాపల్లి: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, ఎన్టీఆర్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ జి.రామ్మూర్తి సతీమణి గోపిశెట్టి వరాహ వెంకట సత్యవతీదేవి (63) రక్తనాళాలు దెబ్బతినడంతో బ్రెయిన్ డెడ్ అయి సోమవారం మృతి చెందారు. విశాఖలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూసిన ఆమె రెండు నేత్రాలు, కిడ్నీలు, కాలేయాన్ని విశాఖ జీవన్‌దాన్ ట్రస్ట్‌కు ఆమె భర్త దానం చేశారు. తన భార్య జన్మ ధన్యమయిందని భావిస్తున్నానని, ఆపదలో ఉన్న వ్యక్తులకు ఈ అవయవాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సత్యవతీదేవి పార్థివ దేహాన్ని మంగళవారం అనకాపల్లి గాంధీనగరం మొదటివీధిలోని తమ స్వగృహానికి తీసుకుని వచ్చి, అక్కడ నుంచి అంతిమ యాత్రగా తీసుకువెళ్లి శారదానది ఒడ్డున హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విశాఖలో రామ్మూర్తిని ఓదార్చారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 83వ వార్డు ఇన్‌చార్జ్ జాజుల రమేష్, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు సంతాపం తెలిపారు.

## న్యూస్‌రీల్

### నా కొడుకును చంపేశారు..

- రోడ్డు ప్రమాదమంటున్నారు
- కలెక్టరమ్మ న్యాయం చేయాలి
- పీజీఆర్ఎస్‌లో వృద్ధుడి నివేదన


బండారు మహాలక్ష్మి

తుమ్మపాల: రాజకీయ ప్రలోభాలతో హత్యకు గురైన తన కుమారుడి మృతిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసు నీరుగార్చుతున్నారని నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామానికి చెందిన బండారు మహాలక్ష్మి వాపోయారు. ఈ కేసు దర్యాప్తును రీ ఓపెన్ చేయమని పోలీసులను ఆదేశించాలని కలెక్టర్ విజయ కృష్ణన్‌కు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తప్పుగా నమోదు చేసిన క్రైం నంబరు 5/2025ను రీఓపెన్ చేసి హత్య కోణంలో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరారు. ఈ ఏడాది జనవరి 11న రాత్రి 11 గంటల సమయంలో శరీరంపై అనేక గాయాలతో రక్తపు మడుగులో తన కుమారుడు బండారు అప్పన్న కనిపించాడని, ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ అధికారులు హత్య అని చెప్పారని పేర్కొన్నారు. హంతకులను గుర్తించి జైలుకు పంపిస్తామని చెప్పిన పోలీసులు నేటికీ దర్యాప్తులో పురోగతి సాధించలేదన్నారు. ఎవరినీ అరెస్టు చేయకపోవడంతో పోలీసులను సంప్రదించగా, మద్యం మత్తులో రోడ్డు ప్రమాదానికి గురై తన కుమారుడు మరణించినట్లు తానే స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు పోలీసులు రాశారని తెలిపారు. తన కుమారుడికి మద్యం అలవాటు లేదని, హత్య జరిగిందని స్పష్టంగా చెప్పినా పోలీసులు తప్పుడు స్టేట్‌మెంట్ రాయడంపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఐదు నెలలుగా కేసును నీరుగార్చి గాలికొదిలేశారని, ఈ హత్య వెనుక రాజకీయ నాయకుల హస్తం ఉందన్నారు. తక్షణమే కేసును రీ ఓపెన్ చేసి తన కుటుంబానికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను ఆయన కోరారు.

### త్వరితగతిన లక్ష్యాలు పూర్తి చేయండి: కలెక్టర్

తుమ్మపాల: వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియా కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో ఆమె సోమవారం సమీక్ష నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సర్వే, సంపద తయారీ కేంద్రాలు, డ్వామా, హౌసింగ్, సూర్యఘర్, పంచాయతీ రాజ్‌లో పలు అంశాల పురోగతిపై ఆమె మాట్లాడారు. వేసవిలో మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. బోర్ల మరమ్మతులకు అవసరమైన విడిభాగాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వర్క్ ఫ్రం హోమ్, మనమిత్ర సేవలు, పిల్లల ఆధార్ నమోదు, ఈకేవైసీ వంటి సర్వేలను తక్షణం పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. పన్నుల వసూలు రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఫారం పాండ్స్, పశువుల నీటి తొట్టెల నిర్మాణం తక్షణం చేపట్టాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా మొక్కల పెంపకానికి భూమిని గుర్తించాలన్నారు.

# కూటమిలో డిప్యూటీ చిచ్చు

- జనసేనకు డిప్యూటీ మేయర్ కేటాయింపుపై ససేమిరా అంటున్న టీడీపీ నేతలు
- 22 రోజుల క్రితం ఉన్న ఐక్యత 'కౌన్సిల్ సాక్షిగా' భగ్నం
- కూటమి పార్టీల్లో బయటపడ్డ లుకలుకలు


హాజరైన ఎమ్మెల్యేలు పల్లా, వెలగపూడి, ఎమ్మెల్సీ వేపాడ


ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, విజయ్‌కుమార్, పంచకర్లతో డిప్యూటీ మేయర్ అభ్యర్థి దల్లి గోవిందరెడ్డి

దాబాగార్డెన్స్ (విశాఖ): ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవనేది నానుడి. దీనికి తగ్గట్టుగానే జీవీఎంసీ డిప్యూటీ మేయర్ పదవి టీడీపీ, జనసేన మధ్య చిచ్చురేపింది. మొన్నటి మేయర్ ఎన్నిక వరకు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఇరుపార్టీల నేతల్లో అసహనం వ్యక్తమైంది. ఇన్నాళ్లూ కూటమి పార్టీలంతా ఒక్కటేనని బయటకు చెబుతున్నా.. ఈ ఎన్నిక సందర్భంగా లుకలుకలు బయటపడ్డాయి. సంఖ్యాబలం ఉండి కూడా కోరం లేక సమావేశం వాయిదా పడిందంటే.. ఐక్యత ఎంత మేర ఉందో అర్థమవుతోంది. మేయర్‌గా పీలా శ్రీనివాసరావును కూటమి సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్న సమయంలోనే డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. టీడీపీ ఆశావాహులు మాత్రం గత వారం రోజులుగా ఈ పదవి కోసం చాలా ప్రయత్నాలు చేశారు. ఎవరికి వారు ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటూ తనకే పదవి వచ్చేలా చూడాలంటూ శతవిధాలా ప్రయత్నాలు చేశారు. అయితే జనసేన పార్టీకే డిప్యూటీ మేయర్ పదవి కేటాయించారు. ఆ పార్టీకి చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డికి ఆ పార్టీ నేతలు బీ ఫారం అందజేశారు.

**కారాలు మిరియాలు**

జనసేనకు చెందిన దల్లి గోవిందరెడ్డికి బీ ఫారం ఇవ్వడంతో టీడీపీ కార్పొరేటర్లు జీర్ణించుకోలేకపోయారు. ఎన్నికకు వెళ్లే ప్రసక్తే లేదని భీష్మించారు. మంగళవారం ఉదయం నగరంలోని ఓ హోటల్లో భేటీ అయిన టీడీపీ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా చీలిపోయారు. హోటల్ నుంచి ఓ వర్గం టీడీపీ కార్పొరేటర్లు వేరే చోటికి వెళ్లిపోయారు. ఓ వర్గం టీడీపీ కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశానికి హాజరైనా.. కోరానికి సరిపడా సభ్యులు లేకపోవడంతో జనసేన ఆశలు ఆవిరైనట్టయింది. దీంతో ఇరు పార్టీల నేతలు కారాలు మిరియాలు నూరుకున్నారు.

**జంప్ జిలానీలు డీలా..**

స్వార్థ రాజకీయాలు, డబ్బులకు అమ్ముడుపోయి వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలో చేరిన కార్పొరేటర్లు, ఇద్దరు స్వతంత్ర కార్పొరేటర్లు వారు ఆశించినట్టు సాగకపోవడంతో తెల్ల మొహాలు వేసినట్టయింది. ఎందుకు పార్టీని వీడామని మధనపడుతున్నట్లు తెలుస్తోంది.

### టీడీపీలో ముసలం పెట్టిందే వీరే..

డిప్యూటీ మేయర్ ఎన్నిక విషయంలో మేయర్ పీలా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, గంటా శ్రీనివాసరావు ముసలం పెట్టారని ఆ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు బాహాటంగా అంటున్నారు. మేయర్ గంధం శ్రీనివాస్‌కు, వెలగపూడి యాదవ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్ మంగవేణికి, గంటా భీమిలి నియోజకవర్గం యాదవ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్ మొల్లి హేమలతకు హామీ ఇచ్చి వారిలో ఆశలు రేకెత్తించారనే ఆరోపణలు భగ్గుమంటున్నాయి.

### దల్లిపై ఎన్ని ఫిర్యాదులో..

డిప్యూటీ మేయర్ పదవి కోసం ఇటీవలే వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలో చేరిన పలువురు కార్పొరేటర్లు.. తొలి నుంచి జనసేన పార్టీలో ఉన్న దల్లి గోవిందరెడ్డిపై అధిష్టానానికి పలు ఫిర్యాదులు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దల్లి గోవిందరెడ్డి గుట్కా వ్యాపారితో అడ్డగోలు వ్యాపారం చేస్తున్నారంటూ ఫిర్యాదులు చేసినట్టు సమాచారం. అవి అవాస్తవమని తెలియడంతో పార్టీ అధిష్టానం దల్లి గోవిందరెడ్డికే డిప్యూటీ మేయర్ పదవి ఇచ్చేందుకు మొగ్గు చూపింది. బీ ఫారం అందజేయడంతో ఆ పార్టీలో చేరిన వారంతా కంగుతిన్నట్టయింది.

### ఇంతలోనే ఎంత తేడా..!

గత నెల 28న మేయర్ ఎన్నిక నిర్వహించారు. కుట్రలు, కుతంత్రాలతో నిర్వహించిన ఎన్నికలో పీలా శ్రీనివాస్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 22 రోజుల తర్వాత నిర్వహించిన డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి పార్టీల్లో లుకలుకలు బయటపడ్డాయి. కేవలం అధికారం కోసం ఏర్పడిన పొత్తు కాబట్టి ఇప్పుడు ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు అంటున్నారు.

# జనసేనకు టీడీపీ జెల్ల

- పొత్తు ధర్మం విస్మరించి ఎన్నికకు డుమ్మా కొట్టిన పలువురు టీడీపీ కార్పొరేటర్లు
- ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్యే కూడా గైర్హాజరు
- కోరంకు 56 మంది అవసరం కాగా 54 మంది హాజరు
- నేటికి ఎన్నిక వాయిదా వేస్తూ ఎన్నికల అధికారి ప్రకటన


సభ్యుల గైర్హాజరుతో ముందు వరుసలో ఖాళీగా ఉన్న కుర్చీలు

దాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికలో జనసేనకు మిత్రపక్షమైన టీడీపీ జెల్ల కొట్టింది. పొత్తు ధర్మం మరిచి డిప్యూటీ మేయర్ కుర్చీ కోసం కుయుక్తులు పన్నింది. డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కేటాయించగా.. సోమవారం జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి పలువురు టీడీపీ ఆశావాహులు డుమ్మా కొట్టారు. దీంతో కోరం లేకపోవడంతో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మయూర్ అశోక్ మంగళవారం నాటికి సమావేశం వాయిదా వేశారు. ముందస్తు సమాచారం మేరకు డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రారంభం కావల్సి ఉంది. ఆ సమయానికి బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఆ పార్టీ కార్పొరేటర్ కవితతోపాటు సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ హాజరయ్యారు. 11.10 గంటలకు జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు కౌన్సిల్‌కు వచ్చారు. 11.15 గంటలకు జనసేనకు చెందిన 14 మంది కార్పొరేటర్లు సమావేశ మందిరానికి చేరుకున్నారు. 11.20 గంటలకు టీడీపీ ఎమ్మెల్యే గణబాబు వచ్చారు. 11.30 గంటలకు కాకి గోవిందరెడ్డి మినహా టీడీపీ కార్పొరేటర్లు ఎవరూ హాజరు కాలేదు. టీడీపీ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాస్ 11.40 గంటలకు కౌన్సిల్ హాల్లోకి అడుగుపెట్టారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మయూర్ అశోక్ 11.53 గంటలకు సమావేశానికి హాజరయ్యారు. వచ్చిన వెంటనే ఎంత మంది సభ్యులు వచ్చారో లెక్కించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికకు 56 మంది అవసరం కాగా 54 మందే హాజరయ్యారని.. కోరం తగ్గట్టు సభ్యులు లేరని గుర్తించారు. దీంతో సమావేశాన్ని మంగళవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో జనసేన ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# దొంగ నోట్ల ఉచ్చులో వ్యాపారులు

- మూడు రోజుల కిందట పెద్ద బొడ్డేపల్లిలో వెలుగులోకి..
- తాజాగా దొంగ నోట్లను పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన ఓ టీచర్


టీచర్ అప్పగించిన నకిలీ 500 నోట్ల కట్టలు

నర్సీపట్నం: దొంగ నోట్లు కలకలం రేపుతున్నాయి. చిరు వ్యాపారులు తెలియక తీసుకుని తరువాత లబోదిబోమంటున్నారు. మూడు రోజుల కిందట పెద్ద బొడ్డేపల్లి ఆర్డీవో బంగ్లాకు సమీపంలోని పండ్ల దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి రూ.500 నకిలీ నోటుతో పండ్లు కొనుగోలు చేశాడు. ఆ వ్యాపారి బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్లగా ఆ నోటు నకిలీదిగా బ్యాంకు సిబ్బంది గుర్తించారు.

➡ తాజా సోమవారం మున్సిపాలిటీ కొత్తవీధిలో నివాసం ఉంటూ కొత్తకోటలో ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్న సాంబశివ దొంగ నోట్లతో ఉన్న సంచిని నర్సీపట్నం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సాంబశివ తన భార్యను ఊరు పంపించేందుకు బైక్‌పై నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు తీసుకొచ్చారు. బస్సెక్కించి వచ్చే సరికి బైక్‌పై సంచి ఉంది. అందులో పాత జీన్ ప్యాంటు, ఒక షర్ట్‌తో పాటు రెండు కొత్త రూ.500 నకిలీ నోట్ల కట్టలు ఉన్నాయి. కంగారు పడిన టీచర్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన సూచన మేరకు నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో నోట్ల కట్టలతో కూడిన సంచిని అప్పగించారు. ఇవి అమెజాన్ చిల్డ్రన్ బ్యాంక్ నుంచి రప్పించినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూ.1000 అసలు నోట్లు చెల్లిస్తే పదివేల రూపాయలు 500 నోట్ల కట్టను పంపిస్తున్నారు. ఒక్కోసారి ఈ నకిలీ 500 నోట్ల కట్టలకు ఆఫర్స్ పెడుతున్నారు. ఒకప్పుడు మిషన్ల ద్వారా దొంగ నోట్లు ప్రింటింగ్ చేసి చలామణి చేసేవారు. ఇప్పుడు అమెజాన్ నోట్లు.. దొంగ నోట్ల చలామణి చేసే వ్యక్తులకు ఒక వరంగా మారాయి. చిల్డ్రన్ బ్యాంక్ పేరుతో కార్పొరేట్ దిగ్గజ కంపెనీ అమెజాన్ ద్వారా పంపిణీ అవుతున్న 500 నోట్ల కట్టల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కొద్ది రోజుల క్రితమే నర్సీపట్నం పోలీసు స్టేషన్‌లో రైస్ పుల్లింగ్ కేసులో 10 లక్షల అమెజాన్ చిల్డ్రన్ బ్యాంక్‌కు చెందిన దొంగ నోట్ల కట్టలు పట్టుబడ్డాయి. ఇటీవల నర్సీపట్నం దుకాణాల వద్ద కూడా ఈ నకిలీ 500 నోట్లు వెలుగు చూశాయి. అసలు, నకిలీ నోట్లకు తేడా తెలియని చిరు వ్యాపారులు మోసపోతున్నారు.

# వైస్ ఎంపీపీలు ఏకగ్రీవం

వైఎస్సార్‌సీపీ కైవసం


విజయలక్ష్మిని అభినందిస్తున్న ఎంపీపీ రాజారామ్, మాజీ ఎంపీపీ రామధర్మజ, ప్రిసైడింగ్ అధికారి వీరన్న నాయుడు, ఎంపీడీవో అప్పారావు


సింహాచలం నాయుడును అభినందిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి

**మాడుగులలో విజయలక్ష్మి..**

మాడుగుల: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం వైస్ ఎంపీపీ–1 ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 21 మంది ఎంపీటీసీలకు గాను 15 మంది ఎన్నికలో పాల్గొన్నారు. మాడుగుల ఒకటవ సిగ్మెంట్‌లో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీగా కొనసాగుతున్న పాలిమేర విజయలక్ష్మిని 15 మంది ఎంపీటీసీలు చేతులెత్తి వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ప్రిసైడింగ్ అధికారి కె.వీరన్ననాయుడు నియామక పత్రం అందజేసి విజయలక్ష్మి చేత రిజిస్టర్‌లో సంతకం చేయించి, ప్రమాణ స్వీకారం చేయించారు.

**దేవరాపల్లిలో పంచాడ సింహాచలంనాయుడు..**

దేవరాపల్లి: వైస్ ఎంపీపీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మామిడిపల్లి ఎంపీటీసీ సభ్యుడు పంచాడ సింహాచలంనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఎస్.మంజులవాణి సమక్షంలో వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా జరిగింది. మండలంలోని 17 ఎంపీటీసీలకు గాను 12 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. సింహాచలంనాయుడు పేరును ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి ప్రతిపాదించగా, ఎం.అలమండ ఎంపీటీసీ పోతల వెంకటరావు బలపరిచారు. ఎంపీటీసీలు సింహాచలంనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు.

# 'అన్నదాత'కు అపసోపాలు

- రీ సర్వే భూ పత్రాల్లో ఆధార్, సెల్ నంబర్లు నమోదులో నిర్లక్ష్యం
- ఇది రైతుల బాధ్యత అంటున్న అధికారులు
- అన్నదాత సుఖీభవ నమోదుకు తిరస్కరణ
- దరఖాస్తుకు నేడు ఆఖరి రోజు
- 25 శాతం కూడా లేని నమోదు
- రికార్డుల సవరణకు రెవెన్యూ, సచివాలయ, వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు


కశింకోట మండల వ్యవసాయ కేంద్రంలో అన్నదాత సుఖీభవ పథకానికి డేటా నమోదు


కశింకోట సచివాలయంలో 1బి కోసం పత్రాలు సమర్పిస్తున్న రైతులు

కశింకోట: అన్నదాత సుఖీభవ పథకంలో నమోదు చేసుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా భూముల రీ-సర్వేలో కొందరి ఆధార్, సెల్ నంబర్ తదితర వివరాలను నమోదు చేయపోవడం, మరికొందరికి తప్పుగా నమోదు చేయడం, భూముల వివరాలు, పేర్లలో తప్పులు చోటు చేసుకోవడం రైతులను కష్టాల పాలు చేస్తోంది. తప్పులు సరిచేసుకోవడం రైతుల బాధ్యతని అధికారులు చెబుతుండడంతో వ్యవసాయ, తహసీల్దార్ కార్యాలయాలు, సచివాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. పని ఒత్తిడి పేరుతో అధికారులు, సిబ్బంది రైతుల పట్ల అసహనం వ్యక్తం చేస్తుండడంతో పాటు సకాలంలో పనులు జరగక నానా అవస్థలు పడుతున్నారు. పథకంలో చేరేందుకు ఈ నెల 20వ తేదీ ఆఖరు రోజు. గడువు నేటితో ముగుస్తున్నా సుఖీభవ పథకంలో నమోదైన వారి సంఖ్య జిల్లాలో 25 శాతం కూడా లేదు.

**కొత్త జాబితా తయారీ**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 అందించే వారు. ఈ పథకం స్థానంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రవేశపెట్టి కూటమి ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికకు వివరాల సేకరణ చేపట్టింది. ప్రభుత్వ సిబ్బంది సుఖీభవ పథకానికి అర్హులను గుర్తించడానికి రైతుల నుంచి డేటా సేకరిస్తున్నారు. ఇప్పటికే తమ వద్ద ఉన్న జాబితా ఆధారంగా రైతుల పట్టాదారు పాసు పుస్తకం నకలు, లేదా 1బి, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్లను సేకరిస్తున్నారు. వీటి ఆధారంగా రైతుల జాబితాలో ఉన్న మేరకు రికార్డులను సరిపోల్చి మరో జాబితాను తయారు చేస్తున్నారు. కొన్నిచోట్ల ఆధార్ కార్డు నంబర్, సెల్ ఫోన్ నంబర్లు రీ-సర్వే రికార్డులకు అనుసంధానం కాకపోవడం, రైతుల పేర్లు తప్పుగా నమోదు కావడంతో సుఖీభవ పథకం నమోదుకు రైతు సేవా కేంద్రాల్లో తిరస్కరిస్తున్నారు. రికార్డులను సవరించుకోవాలని తహసీల్దార్, వీఆర్వోల వద్దకు పంపుతున్నారు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడానికే ఈ క్లిష్టమైన ప్రక్రియను ప్రవేశపెట్టారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**50 వేల మంది మాత్రమే నమోదు**

గతంలో రైతు భరోసా కింద జిల్లాలో 2.30 లక్షల మంది వరకు లబ్ధి పొందారు. వీరిలో ఇప్పటి వరకు 50 వేలు పైబడి మాత్రమే నమోదు అయినట్లు అధికారిక సమాచారం. ఇంకా కౌలు రైతులకు కౌలుదారి కార్డులు ఇవ్వలేదు. వారిని కూడా నమోదు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నమోదు గడువు పొడిగించగలరని అధికారులు పేర్కొంటున్నారు. రికార్డులు సవ్యంగా ఉన్న జాబితాను విజయవాడ కమిషనర్‌కు ఆన్‌లైన్‌లో నివేదిస్తే దాన్ని పరిశీలించి అక్కడ తుది జాబితాను రూపొందించి రైతు సేవా కేంద్రాలకు పంపుతారని, దీంతో అర్హుల ఫేషియల్‌తో ఈకేవైసీ చేయాల్సి ఉంటుందంటున్నారు. ఇది జరగడానికి సమయం కూడా ఎక్కువ పడుతుందని, వచ్చే నెలలో ఈ ప్రక్రియ పూర్తి కాగలదంటున్నారు.

**భూముల రీ–సర్వే పరిగణన**

అన్నదాత సుఖీభవ పథకానికి భూముల రీ-సర్వే డేటాను పరిగణనలోకి తీసుకుంటున్నారు. జిల్లాలో 64 శాతం గ్రామాల్లో రీ- సర్వే పూర్తయిందని సమాచారం. రీ-సర్వే జరగని గ్రామాల్లో మాత్రం పాత పట్టాదారు పాసు పుస్తకాల డేటాను ఆధారంగా తీసుకుని పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. రీ-సర్వేలో భూముల విభజన, పంపకాలు జరగడం వల్ల న్యాయంగా లబ్ధిదారుల సంఖ్య పెరగాల్సి ఉంది.

### కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది



భూమి వివరాలతో ఆధార్ సంఖ్య అనుసంధానం కాలేదు. దీంతో అన్నదాత సుఖీభవ పథకంలో నమోదుకు వ్యవసాయ శాఖ సిబ్బంది తిరస్కరించారు. సచివాలయం, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి సవరించుకోవాలని సూచించారు. సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చింది. రీ-సర్వే సమయంలో ఆధార్ సంఖ్య నమోదు చేయకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నాం.

– ముక్కా సత్తిబాబు, రైతు, వెదురుపర్తి గ్రామం

### 25 శాతం రైతుల రికార్డులు సరిపోల్చాం

అన్నదాత సుఖీభవ పథకానికి జిల్లాలో 25 శాతం మంది రైతుల రికార్డులను సరిపోల్చాం. ఇంకా 75 శాతం వరకు రికార్డులు సరిపోల్చాల్సి ఉంది. దీనివల్ల పథకానికి నమోదుకు గడువు పెరగగలదు. ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లు అనుసంధానం కాకపోవడం, పేర్లు తప్పులు పడటం తదితర వాటిని సవరించేందుకు తహసీల్దార్, వీఆర్వోల వద్దకు సిఫారసు చేస్తున్నాం. కౌలు రైతులకు ఈ పథకం వర్తింపునకు ఇంకా కార్డులు ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో 2.30 లక్షల మంది వరకు ఈ పథకానికి లబ్ధిదారులు ఉంటారని అంచనా.

– బి.మోహనరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, అనకాపల్లి

# పెంటకోట తీరంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు


గల్లంతైన యువకుల వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు



పిల్లి అభిలాష్, గంపల తరీష్(ఫైల్ ఫొటోలు)

పాయకరావుపేట: పెంటకోట తీరంలో సోమవారం సాయంత్రం సముద్ర స్నానానికి దిగి ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వచ్చి ఇలా గల్లంతు కావడంతో పట్టణంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ జె.పురుషోత్తం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేట పట్టణం పాత హరిజనవాడకు చెందిన గంపల తరీష్(17) ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈయన స్నేహితుడు రాజవొమ్మంగికి చెందిన పిల్లి అభిలాష్(19) హైదరాబాద్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరూ పట్టణంలోని బంధువుల ఇంట్లో సోమవారం జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. అనంతరం సాయంత్రం 5 గంటల సమయంలో పెంటకోట సముద్ర తీరానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. స్నానం చేస్తుండగా అభిలాష్ సముద్రంలో మునిగిపోతుండగా.. తరీష్ గమనించాడు. స్నేహితుడిని రక్షించే ప్రయత్నంలో తరీష్ కూడా గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులు, గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి అయినా విద్యార్థుల ఆచూకీ తెలియరాలేదు. మంగళవారం ఉదయం మళ్లీ గాలింపు చేపడతామని ఎస్ఐ తెలిపారు. ఎస్‌డీఆర్ఎఫ్ దళాలతో కూడా గాలింపు చర్యలు చేపడతామన్నారు. ఇద్దరు విద్యార్థులు శుభకార్యానికి వచ్చి, సరదాగా సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతు అవ్వడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# కేసు తేలేదాకా..అభివృద్ధి ఎలా..?



కలెక్టరేట్ వద్ద వినతిపత్రం చూపిస్తున్న అప్పరాయుడిపాలెం, భోగాపురం గ్రామస్తులు

- సందిగ్ధంలో నాలుగు గ్రామాలు
- 2020 తర్వాత జరగని స్థానిక ఎన్నికలు
- విడుదల కాని 15వ ఆర్థిక సంఘం నిధులు
- తమ సమస్య పరిష్కరించాలని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి

**రాంబిల్లి(అచ్యుతాపురం):** ఎవరో ఒక్కరు చేసిన ఫిర్యాదుకు నాలుగు గ్రామాల ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. తక్షణమే తమ గ్రామాలకు ఎన్నికలు నిర్వహించాలని, సాంకేతికంగా అవరోధంగా ఉన్న కోర్టు కేసులు పరిష్కరించాలని రాంబిల్లి మండలానికి చెందిన అప్పారాయుడిపాలెం, భోగాపురం ప్రజలు జిల్లా కలెక్టర్‌ను ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా సోమవారం కోరారు. వివరాలివి...

**టీడీపీ నేత నిర్వాకం వల్లే..**

రాంబిల్లి మండలం పంచదార్ల పంచాయతీ పరిధిలో పంచదార్ల, ధారపాలెం, భోగాపురం, అప్పారాయుడిపాలెం ఉండేవి. ఆయా గ్రామాల ఓటర్ల సంఖ్య సుమారు 2,500. ఈ నాలుగు గ్రామాల్ని పరిపాలన సౌలభ్యం కోసం రెండు పంచాయతీలు చేయాలని నిర్ణయించారు. భౌగోళిక స్థితిగతులకు అనుగుణంగా పంచదార్ల, ధారపాలెం గ్రామాల్ని ఒక పంచాయితీగా, అప్పారాయుడిపాలెం, భోగాపురం గ్రామాల్ని ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించి గ్రామ సభలు నిర్వహించారు. అప్పారాయుడిపాలెం గ్రామం పంచదార్లకు 3 కిలోమీటర్ల దూరంలో ఉందని ఆర్అండ్‌బీ శాఖ ధృవీకరించింది. గ్రామసభ ఆమోదాన్ని పరిగణిస్తూ అభ్యంతరాలుంటే పది రోజుల్లోగా ఫిర్యాదు చేయాలని పంచాయతీ విస్తరణాధికారి విభాగం సూచించింది. అయితే ఈ ప్రతిపాదనలు రుచించని వారు అప్పట్లో కోర్టుని ఆశ్రయించారు. దీనిలో టీడీపీ నేత హస్తముందనేది స్థానికుల ఆవేదన. దీంతో 2020 నుంచి నాలుగు గ్రామాల్లో ముఖ్య పంచాయతీకి పాలకులు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నాలుగు గ్రామాలకు కలిపి సుమారు రూ. 56 లక్షలు ఆగిపోయాయి. రోడ్లు, మంచి నీటి సరఫరా, పారిశుధ్యం పడకేశాయి. నాలుగేళ్లు గడిచినా తమ గ్రామాల ఏర్పాటుకు సంబంధించిన కేసు పెండింగ్‌లో ఉన్నందున ఎన్నికలు జరగలేదని, వెంటనే కోర్టు కేసుల్ని పరిష్కరించాలని ఆయా గ్రామాలకు చెందిన పలువురు జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ ద్వారా మొరపెట్టుకున్నారు.

# ఏపీఐఐసీ భూముల్లో.. కూటమి గద్దలు



ఏపీఐఐసీ భూముల్లో జేసీబీతో గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

- జేసీబీలతో రాత్రిపూట గ్రావెల్ తవ్వకాలు
- నంబర్లు లేని వాహనాల్లో అక్రమంగా తరలింపు
- హోం మంత్రి ఆదేశాలు బేఖాతరు
- పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసిన రెవెన్యూ వర్గాలు
- కేసులు నమోదు చేయకుండా కూటమి నేతల ప్రయత్నాలు

**నక్కపల్లి:** సహజ వనరుల దోపిడీలో కూటమి నాయకులకు హద్దు అదుపు లేకుండా పోతోంది. పరిశ్రమల కోసం ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో గద్దల్లా వాలిపోయి జేసీబీలతో వేలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తవ్వేస్తూ ట్రాక్టర్లపై తరలించి అమ్ముకుంటున్నారు. నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా ఒక్క ట్రాక్టర్ గ్రావెల్ తవ్వినా సరే సహించేది లేదని, దాడులు చేసి కేసులు నమోదు చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత ఇచ్చిన ఆదేశాలను వారు బేఖాతరు చేస్తున్నారు. మంత్రి ఆదేశాలను పక్కన పెట్టేసి అధికారాన్ని అడ్డం పెట్టుకుని గ్రావెల్ దందా కొనసాగిస్తున్నారు. అడ్డుకుంటున్న అధికారులను మంత్రి పేరు చెప్పి బెదిరిస్తున్నారు. పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీ వారు చందనాడ, అమలాపురం, రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, బోయపాడు తదితర గ్రామాల్లో ఐదు వేల ఎకరాలను సేకరించింది. నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లింపు ప్రక్రియ పూర్తిచేసి భూములను స్వాధీనం చేసుకుంది. ఈ భూములను బల్క్‌డ్రగ్ పార్క్, ఆర్సిలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ల కోసం కేటాయించింది. పరిశ్రమలు స్థాపించే ప్రాంతాల్లో ఏపీఐఐసీ వారు మౌలిక సదుపాయాల కల్పించే పనులు ప్రారంభించారు. రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. పనులు చేసే సంస్థలకు గ్రావెల్, ఇసుక అవసరం ఉంది. దీంతో ఉపమాక, నీలకుండీలు, చందనాడ గ్రామాలకు చెందిన కొంతమంది టీడీపీ నాయకులు ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో కొండలు, ఇసుక దిబ్బల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతి లేకుండా జేసీబీలను ఏర్పాటు చేసి రాత్రి సమయాల్లో వేలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. ఇలా తవ్విన గ్రావెల్‌ను నంబర్లు లేని ట్రాక్టర్లపై తరలించి



గ్రావెల్ రవాణాకు ఉపయోగిస్తున్న నంబర్లు లేని ట్రాక్టర్లు

సమీపంలో ఉన్న రసాయన పరిశ్రమలకు, ఇళ్లు, రోడ్లు నిర్మించే వారికి, మౌలిక సదుపాయాలు కల్పించే కాంట్రాక్టర్లకు విక్రయిస్తున్నారు. 15 రోజులుగా జరుగుతున్న ఈ దందా వెనుక మంత్రి అనుచరులమంటూ చెప్పుకు తిరిగే టీడీపీ నాయకుల అండదండలతోపాటు, వారికే చెందిన జేసీబీలు, ట్రాక్టర్లు ఉన్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది రెండు రోజు క్రితం రాత్రి సమయాల్లో దాడులు చేసి గ్రావెల్ తవ్వుతున్న జేసీబీలు, ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటి నంబర్లను నమోదు చేసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే రెవెన్యూ వారిచ్చిన నంబర్ల ఆధారంగా పట్టుబడ్డ వాహనాలను సీజ్ చేయడం కేసులు నమోదు చేయకుండా కొంతమంది కూటమి నాయకులు పైరవీలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

## గ్రావెల్ దందాలో హోం మంత్రి అనుచరులు

నియోజకవర్గంలో ఎక్కడైనా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపితే సహించేది లేదని హోం మంత్రి అనిత ప్రకటించినప్పటికీ ఆమె అనుచరులుగా చెప్పుకుంటున్న వారే గ్రావెల్ దందాలకు పాల్పడటం గమనార్హం. నిత్యం వందలాది ట్రాక్టర్లపై తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. యథేచ్ఛగా గ్రావెల్, ఇసుక తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ మైనింగ్, ఏపీఐఐసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని పరిశ్రమలకు భూములు ఇచ్చిన రైతులు చెబుతున్నారు. ఎవరైనా అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేస్తే హోం మంత్రి పేరు చెప్పి బెదిరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీ చేయిస్తాం, అవసరమైతే భౌతిక దాడులకు పాల్పడతామంటూ హెచ్చరించడం వల్లే అధికారులు కూటమి నాయకుల దందాను అరికట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై సీఐ కుమార స్వామి వద్ద ప్రస్తావించగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు రెవెన్యూ సిబ్బంది నుంచి ఫిర్యాదు వచ్చిందన్నారు. ట్రాక్టర్ల పట్టుకుని అప్పగించలేదన్నారు. కొన్ని వాహనాల నంబర్లు, నంబర్లు లేని ట్రాక్టర్ల వివరాలు ఇచ్చారన్నారు. వాహనాలను తమకు అప్పగిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

# చక్కెర ఫ్యాక్టరీలను ఎపుడు తెరిపిస్తారు ఎంపీగారూ!

వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణరాజు



**కోటవురట్ల :** జిల్లాలో మూతపడిన నాలుగు చక్కెర కర్మాగారాలను ఎపుడు తెరిపిస్తారో ఎంపీ సీఎం రమేష్ ప్రజలకు సమాధానం చెప్పాలని వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.ఎస్.సత్యనారాయణరాజు ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ సీఎం రమేష్ ఎన్నికల ముందు ఎన్నో హామీలు కురిపించారని, అందులో తాండవ, ఏటికొప్పాక, గోవాడ, తుంపాల చక్కెర కర్మాగారాలను తెరిపించి రైతుల జీవితాలలో వెలుగులు నింపుతామని కూటమి తరపున హామీ ఇచ్చారన్నారు. ప్రతి చిన్న విషయానికి ఎంతో హడావుడి చేసే ఎంపీ రమేష్ రైతుల కష్టాల పట్ల ఎందుకు స్పందించడంలేదో తెలపాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా సీఎం రమేష్ చక్కెర ఫ్యాక్టరీలను ఒక్కరోజు కూడా సందర్శించిన పాపాన పోలేదన్నారు. గోవాడ చక్కెర కర్మాగారంలో చెరకు రైతులు అనేక సమస్యలతో ఉక్కిరిబిక్కిరై రోడ్డెక్కి తీవ్ర స్థాయిలో నిరసనలు తెలిపినా ప్రభుత్వానికి పట్టలేదని విమర్శించారు. నాలుగు ఫ్యాక్టరీలను తెరిపించి చెరకుసాగులో అత్యధిక దిగుబడులు వచ్చేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. అధిక దిగుబడిని ఇచ్చే కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన చెరకు దవ్వను తెప్పించి ఇక్కడి రైతులకు సరఫరా చేయాలన్నారు. అంతేకాకుండా వరి, చెరకు పంటలను ప్రోత్సహించేలా ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు.



# దళిత వాడలను పంచాయతీలు చేయాలి

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సునీల్ కుమార్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఏఐఎం వ్యవస్థాపకుడు సునీల్ కుమార్

**నర్సీపట్నం:** ప్రతి దళిత వాడను పంచాయతీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.సునీల్ కుమార్ (ఐపీఎస్) పేర్కొన్నారు. మిషన్ సభ్యుడు, ప్రముఖ వ్యాపారవేత్త గుడబండి నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో నర్సీపట్నం మండలం ఓఎల్‌పురంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సునీల్ కుమార్ ప్రారంభించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని అడగటం లేదని, కొన్ని వందల ఏళ్లుగా అధికారానికి దూరంగా అణగదొక్కబడుతున్న జాతి కోసం దళిత వాడలను పంచాయతీలు చేయాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో వెయ్యి జనాభా దాటిన దళితవాడలు మూడు వేలు వరకు ఉన్నాయన్నారు. వీటిన్నింటిని పంచాయతీలు చేయాలన్నదే ప్రధాన డిమాండ్ అన్నారు. ఏటా బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.20 వేల కోట్లు చూపిస్తున్నారన్నారు. ఈ నిధుల్లో రూ.6 వేల కోట్లు ఇస్తే దళితవాడ పంచాయతీకి రూ.2 కోట్లు వస్తుందన్నారు. కొన్ని వందల సంవత్సరాలుగా అణిచి వేయబడి అధికారానికి దూరంగా ఉన్న జాతికోసం బాధపడాలన్నారు. అనంతరం విగ్రహ దాత నాగేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, ఏఐఎం రాష్ట్ర నాయకుడు శ్రీను, డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, గ్రామ సర్పంచ్ బంటు నాగరాజు, మాల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మరిడియ్య, జనసేన నాయకులు అద్దేపల్లి గణేష్, భూసి వెంకటరావు, దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు చిట్ల చలపతిరావు, పెదపూడి ప్రభుదాసు, ఉపాధ్యాయుడు ఊడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల మంద పంపకాల్లో వివాదం

ఉగ్గినపాలెంలో వృద్ధుడి దారుణ హత్య



అప్పలనాయుడు (ఫైల్)

**కశింకోట:** గొర్రెల మంద పంపకాల విషయమై ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదంలో వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన మండలంలోని ఉగ్గినపాలెంలో కలకలం రేపింది. సీఐ అల్లు స్వామినాయుడు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం... గొర్రెల మంద పంపకాల విషయమై గ్రామానికి చెందిన పక్కుర్తి అప్పలనాయుడు (65), కుమారుడు, అతని తమ్ముడుకు ఒమ్మి నూకరాజు, కుమారుడు ఒమ్మి శ్రీను మధ్య ఆదివారం వివాదం ఏర్పడింది. ఈ వివాదం తీవ్ర రూపం దాల్చింది. దాంతో రాత్రి 9.30 గంటల సమయంలో కోపోద్రిక్తులైన నిందితులు నూకరాజు, శ్రీను అప్పలనాయుడుపై కర్రలతో దాడి చేశారు. కింద పడవేసి కాళ్లతో పొట్ట భాగంలో తొక్కుతూ తీవ్రంగా గాయపర్చారు. అయితే కొన ఊపిరితో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు అక్కడ వైద్యుడు ధ్రువీకరించారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయడానికి గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. కేసును సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# చిన్నారి కిడ్నాప్ కేసులో మరో ఇద్దరు..

**అనకాపల్లి:** పట్టణంలోని లోకవారి వీధిలో చిన్నారి భీశెట్టి లోహిత(4) కిడ్నాప్ కేసు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో ఏ1- టొంటోని లక్ష్మి, ఆమె భర్త ఏ2-టొంటోని అప్పలస్వామిలను అరెస్ట్ చేసి, వారి కాల్ డేటా ఆధారంగా విచారిస్తున్నారు. ఈ కేసులో ఉన్న గ్యాంగ్‌ను పట్టుకునే పనిలో దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. అయితే ఈ ముఠా వెనక ఇంకా ఎవరెవరు ఉన్నారు..? గతంలో ఇలాంటి చిన్నారులను కిడ్నాప్ చేశారా..? అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఇటువంటి మిస్సింగ్ కేసులు ఎన్ని నమోదయ్యాయి. వాటికి వీరికి ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.



# అర్జీల పరిష్కారం తూచ్..

- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో మా మొర వినడం లేదు
- పలుమార్లు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదు
- కార్యాలయాల చుట్టూ తిరగలేక చస్తున్నాం
- అర్జీదారుల ఆవేదన, అసహనం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



కలెక్టరేట్‌కు క్యూకట్టిన అర్జీదారులు

**తుమ్మపాల:** అర్జీదారులపై అధికారులకు కరుణే లేదు.. సమస్యలు పరిష్కరిస్తారని గంపెడాశతో వస్తే కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారే గానీ పట్టించుకోవడం లేదు.. అని కలెక్టరేట్‌కు వచ్చిన పలువురు అర్జీదారులు తమ ఆవేదన, అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు తమ గోడును విన్నవించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి అనేక మంది తరలివచ్చారు. వ్యయ ప్రయాసలకోర్చి మండుటెండను సైతం లెక్కచేయకుండా వచ్చినప్పటికి సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపడం లేదని, విధుల్లో భాగంగా ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ ద్వారా అర్జీలు తీసుకుని చేతులు దులుపుకుంటున్నారని వాపోతున్నారు. ఇప్పటికే అనేక సార్లు వచ్చినా సమస్య పరిష్కారం కాకపోవడంతో విసుగు చెంది పురుగులు మందులు, పెట్రోల్ వంటి ప్రాణాంతక పదార్థాలు వెంట తెచ్చుకుని అధికారులు, కలెక్టరేట్ పరిసరాలలో ఆత్మహత్యా యత్నాలతోపాటు పలు రకాల నిరసనలకు తెగిస్తున్నారు.

**ఆలస్యంగా పీజీఆర్ఎస్...**

➡ పీజీఆర్ఎస్ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సి ఉన్నప్పటికి అధికారుల రాక ఆలస్యమవడంతో అర్జీదారులు కొంత సమయం క్యూలోనే వేచి ఉండాల్సి వచ్చింది.

➡ యలమంచిలి 10వ వార్డు సచివాలయం పరిధిలో అర్హత ఉండి పింఛన్లు మంజూరు కావడం లేదంటూ 40 మందికిపైగా అర్హులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఇటీవల ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పింఛన్ల పథకంలో అర్హులుగా తమను చేర్చాలని అర్జీలు అందజేశారు.

➡ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలను కలెక్టర్ విజయ కృష్ణన్, డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి స్వీకరించారు. మొత్తం 370 అర్జీలు సమోదయ్యాయి.

**దివ్యాంగులకు ఉచితంగా ఇల్లు కట్టివ్వాలి**

నిరుపేదలైన అనేక మంది దివ్యాంగులకు ప్రభుత్వమే కాలనీ నిర్మించి ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఇల్లుతోపాటు కరెంటు, నీరు, తదితర సౌకర్యాలు కల్పించాలని శ్రీరామ దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు విన్నవించారు.

**ఔట్ సోర్సింగ్ సిబ్బందికి పథకాలు అమలు చేయాలి**

నెలకు రూ.13 వేల జీతంతో జీవించే తమకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పథకాలు కట్ చేసి మరింత నిరుపేదలను చేస్తున్నారని జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు వాపోయారు. నెలకు రూ.30 వేలకుపైగా జీతం పొందుతున్న ప్రైవేటు ఉద్యోగులకు అన్ని పథకాలు వర్తించినట్లే తమకు అమలు చేసి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

**కరెంటు, మంచినీళ్లూ ఇవ్వండయ్యా..**



ప్రభుత్వ ఆర్థిక సాయంతో సొంత స్థలంలో ఇల్లు కట్టుకున్నాను. ఊర్లో అందరికి ఇంటింటి కుళాయిలు వేశారు. మా ఇంటికి మాత్రం వేయలేదు. దూరం నుంచి బిందెలతో నీరు తెచ్చుకోవడం కష్టంగా ఉంది. కరెంటు మీటరు కోసం రూ.1,800 చెల్లించినప్పటికి కనెక్షన్ ఇవ్వలేదు. న్యాయం చేయాలని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా – **పల్లా అర్జునమ్మ,** తురకలపూడి, బుచ్చెయ్యపేట మండలం

## కొడుకు చూడలేదు.. పురుగుల మందు తాగి చచ్చిపోతా



**అయ్యా..** నా పేగు తెంచుకుని పుట్టిన బిడ్డను పెంచి పెద్ద చేస్తే, ఈ రోజు ఇంటి నుంచి బయటకు గెంటేస్తున్నాడు. నన్ను నానా చిత్రవధ చేస్తున్నాడు. వాడి నుంచి నాకు రక్షణ కల్పించాలని ఐదేళ్లుగా పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా.. ఇప్పటికి ముగ్గురు ఎస్సైలు మారారు. నా సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదు. అందుకే ఈ రోజు న్యాయం చేయకపోతే చచ్చిపోదామని పురుగులు మందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చానని ఎస్.రాయవరం మండలం వేమగిరి గ్రామానికి చెందిన వృద్ధురాలు వై.సరోజమ్మ కన్నీరుమున్నీరైంది. కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద పోలీసులు తనిఖీల్లో పురుగుల మందు డబ్బా గుర్తించి ఆమెను బయటకు తీసుకొచ్చి ఎస్.రాయవరం పోలీసులకు సమాచారం ఇచ్చి అక్కడికి పంపించారు. అయితే ఎస్.రాయవరం ఎస్సై కూడా న్యాయం చేయడం లేదని, కలెక్టర్ కళ్లెదుటే పురుగుల మందు తాగి చచ్చిపోతానంటూ వృద్ధురాలు రోదించింది.

## ఎస్పీ కార్యాలయానికి 40 అర్జీలు



అర్జీదారుల సమస్యను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

**అనకాపల్లి:** ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 40 అర్జీలు వచ్చాయి. ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల సమస్యలు సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలు, చీటింగ్, భూ సమస్యలపై అర్జీలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

**అనకాపల్లి టౌన్:** జిల్లాలోని 19 కేంద్రాల్లో సోమవారం జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 601 మంది విద్యార్థులకు గాను 411 మంది హాజరయ్యారని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో మూడు కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు 65 మందికి గాను 50 మంది, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షకు 143 మందికిగాను 118 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తం 22 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశామని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు.

# వడ్డాది టీడీపీ అధ్యక్షుడి ఎన్నికలో వర్గ విభేదాలు



వడ్డాది టౌన్ అధ్యక్షుడిగా ఎన్నికైన నరేష్‌ను అభినందిస్తున్న నాయకులు

**బుచ్చెయ్యపేట :** ఎమ్మెల్యే రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మధ్య వర్గ విభేదాల ప్రభావం ఇపుడు వడ్డాది టీడీపీ అధ్యక్షుడు పదవిపై పడింది. ఇటీవల గ్రామ టీడీపీ అధ్యక్షుని ఎన్నికల్లో భాగంగా గ్రామ టీడీపీ నాయకులు వడ్డాదిలో మీటింగ్ పెట్టారు. రెండేళ్లుగా టౌన్ అధ్యక్షుడిగా ఉన్న రాష్ట హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మేనల్లుడు దొండా నరేష్‌ను తిరిగి టౌన్ అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. అనంతరం కమిటీ మెంబర్లు తీర్మానం కాపీని మండల టీడీపీ గౌరవ అధ్యక్షుడు తమరాన దాసుకు, ఎమ్మెల్యే రాజుకు అందించారు. వడ్డాది టౌన్ అధ్యక్షుడిగా ఎన్నికైన నరేష్ ఎమ్మెల్యే రాజును కలిసి ఎన్నికైన విషయాన్ని తెలపగా ఎమ్మెల్యే అతనిని అభినందించారు. ఇదే పదవి నరేష్‌కు కాకుండా తాతయ్యబాబు బావమరిది గ్రామదేవత మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ దొండా గిరిబాబుకు ఇవ్వాలని మాజీ ఉప సర్పంచ్ సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, మండల యాదవ సంఘం అధ్యక్షుడు శింగంపల్లి రమేష్, నాయకుడు శ్యామ్ తదితరులు తీర్మానం చేసి ఎమ్మెల్యే రాజును కలిసి దరఖాస్తు అందించారు. అప్పటికే నరేష్‌ను టౌన్ టీడీపీ అధ్యక్షుడిగా ప్రకటించిన విషయం ఎమ్మెల్యేకు తెలిసినా ఆ విషయాన్ని రెండో వర్గానికి చెప్పకుండా వారి నుంచి దరఖాస్తు తీసుకోవడంపై పలువురు టీడీపీ నాయకులు ఆగ్రహం చెందుతున్నారు. స్వయాన తాతయ్యబాబు మేనల్లుడు దొండా నరేష్, బావమరిది దొండా గిరిబాబు వడ్డాది టౌన్ అధ్యక్షుడి పదవికి పోటీ పడడం వెనక ఎమ్మెల్యే ద్వంద్వ వైఖరి బయట పడిందని అంటున్నారు. సోమవారం చోడవరంలో నియోజకవర్గ మినీ మహానాడు జరిగినా వడ్డాది టౌన్ అధ్యక్షుడి పేరు మాత్రం ఎమ్మెల్యే ప్రకటించలేదు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సయ్యపురెడ్డి మాధవరావు, కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్ చైర్మన్ మేడివాడ రమణ, మాజీ వార్డు మెంబర్, తలారి శంకర్,నాయకులు ముత్యాల సూరిబాబు తదితరులు నరేష్‌నే వడ్డాది టౌన్ అధ్యక్షుడిగా నియమించాలని పట్టుబడగా, మరో వర్గం గిరిబాబుకి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఎమ్మెల్యే రాజు ఎవరిని ఎంపిక చేస్తారోనని ఎదురు చూస్తున్నారు.

## క్లుప్తంగా

### మీ చేతిలోనే తల రాత


మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి జగన్నాథం

**కశింకోట:** విద్యార్థులు చదువుతోపాటు దస్తూరి (చేతిరాత)ని మెరుగుపర్చుకోవాలని గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం తెలిపారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఒక వాక్యాన్ని పది సార్లు రాస్తే అది గుర్తుండిపోతుందన్నారు. ఈ సందర్భంగా నీతి కథలను బోధించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

### వాడ్రాపల్లి హైస్కూల్ టీచర్ ప్రసాద్ హఠాన్మరణం


కాతుల జాన్ ప్రసాద్

**మునగపాక:** మండలంలోని వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్) కాతుల జాన్ ప్రసాద్(61) గుండె పోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. అనకాపల్లికి చెందిన ప్రసాద్ గత కొంత కాలంగా వాడ్రాపల్లి హైస్కూల్‌లో పని చేస్తూ పిల్లలకు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం పొందేందుకు ఎనలేని కృషి చేశారు. మరో ఏడాదిలోగా ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ఆయన గుండెపోటుకు గురై మృతి చెందడంపై పలువురు విచారం వ్యక్తం చేశారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడులతో పాటు ఎంఆర్సీ కార్యాలయం ఉద్యోగులు, ఉపాధ్యాయులు.. ప్రసాద్ మృతికి సంతాపం తెలిపారు.

### ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ

- భార్యాభర్తలకు గాయాలు

**అనకాపల్లి టౌన్:** పట్టణంలోని బైపాస్ రోడ్ ఉమ్మలాడ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన సంఘటనలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. పట్టణ సీఐ విజయ్ కుమార్ అందించిన వివరాల ప్రకారం.. అచ్యుతాపురం మండలం పెదపాడు గ్రామానికి చెందిన కొనిశెట్టి సూరిబాబు, భార్య భవాని అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన మూడు నెలల పాప వద్దకు వచ్చారు. అక్కడ ఆస్పత్రిలో పాప డిశ్చార్జ్ తీసుకుని తిరిగి తమ ఇంటికి ముగ్గురూ బయలుదేరారు. ఈ క్రమంలో ఉమ్మలాడ జంక్షన్‌కు వచ్చేసరికి కాకినాడ వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సూరిబాబుకు స్వల్పం, భవానికి తీవ్ర గాయాలయ్యాయి. ఈమె ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పాప ప్రమాదం నుంచి బయట పడింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతం

**కశింకోట:** స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలులో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 32 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మండలంలోని అన్ని హైస్కూళ్లకు చెందిన టెన్త్ ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు.

### కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రం ప్రారంభం

**మాడుగుల రూరల్:** స్థానక సచివాలయం -3 కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, నందారపు సన్యాసిరావు, రమేష్ పాల్గొన్నారు.

## అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| లెవన్ | :రాజా |
| అర్జున్ సన్ఆఫ్ వైజయంతి | :సత్యనారాయణస్క్రీన్-1 |
| లవ్లీ | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| హిట్-3 | :పర్తిసాయి |
| సింగల్ | :షిర్డీసాయి |
| మన కుటుంబం | :వెంకటేశ్వర |
| అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి | :శ్రీసత్య |
| ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ | :రామచంద్ర |

## గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

## రక్త నిల్వలు

**అనకాపల్లి:** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17 యూనిట్లు, బీ పాజిటివ్-14, ఓ పాజిటివ్-18, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

# రోడ్లపైనే చెత్తాచెదారాలు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు
- గ్రామాల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర ఎలా...


రహదారిపై డ్రైనేజీ వ్యవస్థ


వెంకటరమణపేట, ఎన్టీఆర్ కాలనీ, గోపాలపురం వెళ్లే మార్గంలో రహదారిపై డ్రైనేజీ వ్యవస్థ

**అనకాపల్లి:** గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలంటారు. అవి అభివృద్ధి చెందినప్పుడే గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందనేది నిజం. అయితే అధికారులు, ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. అనకాపల్లి మండలంలో 32 పంచాయతీల పరిధిలో లక్షా 15 వేల మంది జనాభా నివసిస్తోంది. వీటి పరిధిలోని గ్రామాల్లో రహదారుల పక్కనే చెత్తా చెదారాలు, అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ దర్శనమిస్తున్నాయి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోకపోవడంతో ప్రధాన రోడ్ల పక్కనే గ్రామ పంచాయతీలు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి.

**స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు...**

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య, కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి పట్టణం, గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. చుట్టు పక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి కాలంలోనే గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయాలి. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగు నీరు రహదారులపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో గ్రామాల్లో వీధులు డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడంతో దోమలు, ఈగలు ద్వారా లార్వాల సంతతికి నెలవుగా మారింది. దీంతో స్థానికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.

**వ్యర్థాలన్నీ రహదారుల పక్కనే...**

చెత్తకుప్పల వల్ల అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గాలి వీచినప్పుడు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు చెత్త నుంచి కాగితాలు, పాలిథిన్ కవర్లు ఎగురొచ్చి వాహనాలపై పడుతుండడంతో డ్రైవర్లు వాటిని తీయబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. నిల్వ పదార్థాలను రోడ్డుపై వేయడంతో ప్రజలు, వాహనదారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవే కాకుండా ఖాళీ కొబ్బరి బొండాలు, కోళ్లు, చేపల వ్యర్థాలు కూడా ఇక్కడే పడేస్తున్నారు. ఈ రహదారులకు ఇరువైపులా రాకపోకలు సాగించే వారికి నిత్యం అగచాట్లు తప్పడం లేదు. రాత్రిళ్లు వాహనాల వేగంతో పాటు చెత్త నుంచి వచ్చే వాసనలు భరించలేకపోతున్నామని వాపోతున్నారు.

### వేసవిలో డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయాలి



డ్రైనేజీల్లో పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. వేసవిలో డ్రైనేజీని శుభ్రం చేయడం వల్ల చెత్తాచెదారం త్వరగా బయటకు తీయవచ్చు. డ్రైనేజీని పరిశుభ్రం చేయడం వల్ల వర్షాకాలంలో వర్షపు నీరు పొలాల్లోకి పోయేందుకు ఆటంకం ఉండదు. మా గ్రామంలో చాలా వీధుల్లో డ్రైనేజీలు నిర్మించలేదు. ప్రజల వాడుక నీరు రహదారులపై చేరుతోంది.

– ఈశ్వరరావు, రేబాక గ్రామం, అనకాపల్లి మండలం

### డ్రైనేజీ నీరంతా రహదారులపైనే..



ఊరు చివర్లో చెత్తాచెదారం వేస్తారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ ఎక్కడా కనిపించడం లేదు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఎక్కడా కనిపించడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. డ్రైనేజీ వ్యవస్థపై అధికారులు దృష్టి సారించాలి. ఇది సరిగా లేకపోవడంతో గ్రామీణ ప్రజలు వాడిన నీరు రహదారులపై పారడం వల్ల వివిధ రకాల వ్యాధులు బారిన పడుతున్నారు.

– సాయి, కూండ్రం గ్రామం, అనకాపల్లి మండలం

# ఉదయం జల్లులు.. మధ్యాహ్నం ఎండ

విభిన్న వాతావరణంలో ప్రజల ఉక్కిరిబిక్కిరి


ఎండకు నిర్మానుష్యంగా శారదానది బ్రిడ్జి


రద్దీగా పండ్ల రసాల షాపు

**అనకాపల్లి టౌన్:** భానుడు ఉగ్రరూపాన్ని చూపించాడు. సోమవారం ఉదయం కాస్త చిరుజల్లులు పడినా మధ్యాహ్నం 12 గంటల నుంచి ఎండ మండిపోయింది. సాయంత్రం ఐదు దాటినా చల్లబడలేదు. ఉష్ణోగ్రతలు తగ్గ హెచ్చుల విభిన్న వాతావరణంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఒక్కసారిగా ఎండ పెరిగిపోవడాన్ని తట్టుకోలేకపోయారు. దీంతో సమీప గ్రామాల నుంచి వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల వైపు పరుగులు తీశారు. ఎక్కువగా చెరకు రసాలు, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలను సేవించి వేసవి తాపం తీర్చుకున్నారు. మరికొంత మంది ఏసీ సినిమా థియేటర్ల వైపు మళ్లారు.

### విభిన్న వాతావరణంలో ప్రమాదమే...



ఎండ, వాన విభిన్న వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు పడతారు. ఒక్కసారిగా శరీరం వేడి అయినా, చల్లబడినా జ్వరాలు వస్తాయి. ఈ జ్వరాలకు భయపడరాదు. అనుకోని వర్షాలలో తడవరాదు. ప్రధానంగా పిల్లలు, వృద్ధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎక్కువగా మంచినీరు, కొబ్బరి నీరు సేవించాలి. మితాహారం తీసుకోవాలి. ఎక్కువగా ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలి. ఏసీలు వాడేవారు తక్కువ టెంపరేజర్‌లో ఉంచుకోవాలి.

– డాక్టర్ వాణీజగదీశ్వరి, పీహెచ్‌సీ, తుమ్మపాల

# ప్రమాదకరంగా ఫుట్‌పాత్ గ్రిల్స్


తుప్పుపట్టి పాడైపోయిన ఆస్పత్రి ప్రవేశ మార్గంలో ఐరన్ గ్రిల్స్

**అనకాపల్లి టౌన్:** పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం ప్రవేశ మార్గంలో కాలువపై ఫుట్‌పాత్‌గా వేసిన ఐరన్ గ్రిల్స్ ప్రమాదకరంగా మారాయి. అవి తుప్పుపట్టి పాడైపోవడంతో రాకపోకలు సాగించే రోగులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల ఆస్పత్రికి నడిచి వచ్చే వారు గాయాల పాలవుతున్నారు. రెండు రోజుల క్రితం చికిత్స పొందుతున్న రోగిని చూడడానికి వచ్చి ఫుట్‌పాత్‌పై వస్తున్న సమయంలో కాలు గ్రిల్స్ మధ్య చిక్కుకుంది. దీంతో అతి కష్టం మీద బయటకు తీసి మరలా అదే ఆస్పత్రిలో కట్టు కట్టించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని బాధితుడు వాపోయాడు. ద్విచక్ర వాహనదారులు లోపలికి వెళ్లేటప్పుడు అనుకోకుండా ఎదురుగా మరొక వాహనం వస్తున్నప్పుడు షడన్ బ్రేక్ వేసి కాలు కింద పెట్టినప్పుడు గ్రిల్స్ మధ్యలో కాలు ఇరుక్కుని కింద పడిపోతున్నామని పలువురు వాపోతున్నారు. తక్షణమే గ్రిల్స్‌ను బాగుచేయించాలని పలువురు కోరుతున్నారు.

# విస్తృత పోరాటాలే సుందరయ్యకు ఘనమైన నివాళి


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

**అనకాపల్లి:** దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పార్టీ మొట్టమొదటి జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్థంతి కార్యక్రమం స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగింది. సుందరయ్య చిత్రపటానికి ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవ కోసం పిల్లలే వద్దనుకున్న త్యాగజీవి సుందరయ్య అన్నారు. దేశంలో విలువలతో కూడిన రాజకీయాలకు తిలోదకాలిస్తున్న నేటి బూర్జువా పార్టీలు సుందరయ్య వంటి మహానేత నిరాడంబరతను, త్యాగనీరతిని అలవర్చుకోవాలని కోరారు. తన యావదాస్తిని పార్టీకి, పేదలకు ఇచ్చిన మహానేత అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపైన, మతోన్మాదానికి వ్యతిరేకంగాను, కింది స్థాయి ప్రజల్లో మరిన్ని పోరాటాలను విస్తృతంగా నిర్వహించడమే సుందరయ్యకు ఇచ్చే ఘనమైన నివాళులన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్. శంకరరావు, జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్యబాబు, తులసీరామ్, రమేష్, బి. నూక అప్పారావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలి నేత్రదానం


ఈశ్వరరావుకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేస్తున్న వైద్యురాలు

**అనకాపల్లి:** నేత్ర దానం చేయడం వల్ల చూపులేని మరో ఇద్దరికి కంటి వెలుగును ప్రసాదించవచ్చని పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీను తెలిపారు. అనకాపల్లి బర్మా కాలనీకి చెందిన మద్దాల అప్పలనరసమ్మ(80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. ఆమె నేత్రాలను కుమారుడు ఈశ్వరరావు విశాఖ ఎల్వీ ప్రసాద్ మోసిన్ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. నేత్రదానం-అంధకారాన్ని తొలిగించే ఓ గొప్ప ఆయుధమని, మనిషి మరణించాక కూడా బతికేలా చేసే ఓ మహోన్నతమైన దానం నేత్రదానమని ఆయన పేర్కొన్నారు.

# ఎన్టీపీసీ వద్ద కాంట్రాక్ట్ వర్కర్ల ఆందోళన



ఎన్టీపీసీ మెయిన్‌గేట్ వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

**పరవాడ:** సింహాద్రి ఎన్టీపీసీలో పోలీస్ వెరిఫికేషన్ పేరుతో కాంట్రాక్టు కార్మికులను వేధించడం తగదని ఎన్టీపీసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ మెయిన్ గేట్ వద్ద సోమవారం కాంట్రాక్టు కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల నుంచి క్యారెక్టర్ సర్టిఫికెట్ తీసుకురావాలని యాజమాన్యం ఒత్తిడి చేయడం అన్యాయమన్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం మార్వాడీ కంపెనీ కంటే ఘోరంగా తయారయిందని ఆక్షేపించారు. ఎన్టీపీసీలో ఇప్పటి వరకు వైద్య పరీక్షల పేరుతో కార్మికులను వేధించేవారని, ఇది కొనసాగుతుండగానే మళ్లీ పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ల కోసం వేధిస్తుండడం అన్యాయమన్నారు. 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులకు ఇప్పుడు పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ నిబంధన పెట్టడడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి.పి.నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గోవిందరాజు, రమణ, శ్రీను, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



మల్లునాయుడుపాలెంలో రైతులతో కలిసి అవగాహన ర్యాలీలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

**సబ్బవరం:** ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించడం ద్వారా లాభసాటి పంటలను పండించడమే కాకుండా ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులను సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ సీహెచ్ సత్యవతి తెలిపారు. మండలంలోని మల్లునాయుడుపాలెం సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ బోను దేవుడమ్మ ఆధ్వర్యంలో ప్రకృతి సేద్యంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో చేయబోయే సర్వే చాంపియన్, ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీ మాన్‌సూన్ డ్రైసోయింగ్‌లో భాగంగా ఎకరాకు సరిపడా రూ.1250 విలువైన 30 రకాల విత్తనాలతో కూడిన 12 కిలోల కిట్‌ను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గుంటలలో ఎకరాకు రెండు కిలోల చొప్పున విత్తనాలు వేసుకోవడం ద్వారా నేలలో కర్బన శాతం పెరుగుతుందన్నారు. దీంతో పోషకాలు, జీవ వైవిధ్యం, నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, ప్రధాన పంటలో దిగుబడి మెరుగ్గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ త్రిమూర్తులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమలత, వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### నూకాంబిక సేవలో అన్నవరం ఈవో


నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న ఈవో సుబ్బారావు దంపతులు

**అనకాపల్లి:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారిని కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఈవో వి.సుబ్బారావు దంపతులు, అర్చకుడు సత్యచంద్రశేఖరేంద్ర సరస్వతి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు నూతనంగా నిర్మించనున్న అమ్మవారి ఆలయాన్ని ఈవో పరిశీలించారు. వీరికి నూకాంబిక ఆలయ ఈవో వెంపలి రాంబాబు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు), ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

# ఏకపక్షంగా వార్డు కమిటీలు ఆక్షేపణీయం

మినీ మహానాడు వేదికగా పీలాపై బుద్ధ ఆగ్రహం


మాట్లాడుతున్న పీలా గోవింద సత్యనారాయణ

**అనకాపల్లి టౌన్:** మినీ మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. పట్టణంలోని సత్యగ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ మినీ మహానాడు సోమవారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్, అనకాపల్లి టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని విమర్శించారు. అధికారులు తమ మాట వినడం లేదని వాపోయారు. బుద్ద నాగజగదీశ్వరావు మాట్లాడుతూ ఐదు వార్డుల్లో బలమైన సీనియర్ కార్యకర్తలు ఉన్నారని, కానీ పీలా గోవింద ఏకపక్షంగా వార్డు కమిటీలను ప్రకటిస్తున్నారని వేదికపై బహిరంగంగా విమర్శించారు. ఇటీవల నియమించిన 84వ వార్డు కమిటీని తిరిగి నియమించాలన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమం తూతూ మంత్రంగా కొనసాగుతుందన్నారు. అర్జీలు పరిష్కరించకుండా జిల్లా అధికారులే తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో అధికారులే ఇప్పటికీ పని చేస్తున్నారని, వీరు ప్రతిపక్షానికి అనుకూలంగానే పనిచేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, పార్టీ సీనియర్ నాయకులు నీలబాబు, కాయల మురళీధర్ పాల్గొన్నారు.

### మందుబాబులకు జరిమానా

**పెందుర్తి:** పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఎనిమిది మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.80 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ వెల్లడించారు.

# ఘనంగా దేవతమ్మ ఉత్సవం


శారదానదిలో దోనెపై దేవతమ్మను నిమజ్జనానికి తీసుకెళుతున్న నిర్వాహకులు


గవర పేటలో దేవతమ్మ నిమజ్జనోత్సవ ఊరేగింపు


దేవతమ్మ వారికి భక్తుల పూజలు


కోలాటం ఆడుతున్న మహిళలు

**కశింకోట:** స్థానిక గవరపేటలో దేవతమ్మ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పంచ రంగులతో గుండ్రంగా చక్రాకారంలో వేసిన ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవంలో భాగంగా పసుపు, కుంకుమ, బొగ్గు పొడి, తంగేడు ఆకులతో చేసిన పచ్చరంగు పొడి, తెల్ల ముగ్గుతో ఐదు వరుసల ముగ్గు వేశారు. దాన్ని 'వేగి' ఇంటి పేరు కలిగిన స్థానికులతోపాటు పూర్వ విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కుటుంబాలు ఉత్సాహంగా హాజరై సంప్రదాయంగా ముగ్గు తొక్కారు. జముకుల కళాకారులు పాటలు పాడి ఆహూతులను అలరించారు. అనంతరం అమ్మవారి నిమజ్జనోత్సవం నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపాన్ని బుట్టలో నిలిపి తీన్‌మార్, మహిళల కోలాటాలతో నృత్యాలు చేస్తూ ఆలయం నుంచి శారదా నది వరకు ఊరేగింపు నిర్వహించారు. యువకులు, పెద్దలు ఉత్సాహంగా రంగులు పూసుకొని నృత్యాలు చేశారు. అనంతరం దోనెలపై శారదానది అవతలకు తీసుకెళ్లి అమ్మవారిని నిమజ్జనం చేశారు. ముందుగా ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి చీరలు, రవికెలు, అరటి గెలలు, పండ్లు సమర్పించి పూజలు నిర్వహించారు. వేగి పవన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధనతోపాటు అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల అమ్మకం నిర్వహించారు.

### అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన జీఆర్‌కే పంత్ రూ. లక్ష 116లు విరాళాన్ని అందించారు. సంబంధిత నగదును సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు పీఆర్వో కార్యాలయ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్‌ను అందించారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను బహూకరించారు.

# అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.